బీఆర్ఎస్‌పీపీ విలీన వార్తలు అవాస్తవం

- బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా
- ఎంపీ వద్దిరాజు స్పష్టీకరణ

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ) : తాను బీజేపీలో చేరుతున్నట్టు వస్తున్న వార్తలను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర శనివారం ఓ ప్రకటనలో ఖండించారు. బీజేపీలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ విలీనమవుతున్నట్టు వస్తున్న కథనాల్లో నిజం లేదని, అవి అభూత కల్పనలని కొట్టిపారేశారు. బీఆర్ఎస్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు, పార్టీని బలహీనపర్చేందుకు నిరాధారమైన, వాస్తవ విరుద్ధమైన కథనాలను కొన్ని మీడియాసంస్థలు ప్రచారం చేయడం విచారకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే ముందుకు సాగుతామని స్పష్టంచేశారు.

కేటీపీపీలో విద్యుత్తు ఉత్పత్తి నిలిపివేత

గణపురం, జూలై 13: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిల్పూరులోని కాకతీయ థర్మల్ విద్యుత్తు కేంద్రంలోని మొదటి దశ 500 మెగావాట్ల ప్లాంట్‌లో విద్యుత్తు ఉత్పత్తిని శుక్రవారం రాత్రి నిలిపివేశారు. జెన్‌కో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏటా ప్రాజెక్టులో ఓవరాలింగ్ పనులు చేపడుతారు. ఈ నేపథ్యంలో 500 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తిని నిలిపివేసి మెయింటనెన్స్ పనులు ప్రారంభించారు. నెల రోజులపాటు ఉత్పత్తి నిలిచిపోనున్నది.

మోహన్‌రుషి, పసునూరి శ్రీధర్‌బాబుకు మల్లావధుల సదాశివుడు స్మారక పురస్కారాన్ని అందజేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, మల్లావధుల సదాశివుడి తనయుడు విజయానంద్ తదితరులు

ప్రజా గొంతుకగా సదాశివుడు పాటలు

మలి ఉద్యమంలో చైతన్యం కలిగించాయి: హరీశ్‌రావు

రవీంద్రభారతి, జూలై 13: మల్లావధుల సదాశివుడు సాహిత్యం పాటలు తెలంగాణ ఉద్యమానికి, ఉద్యమ సారథి, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు ఎంతో స్ఫూర్తిని ఇచ్చాయని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ వికాస సమితి-చేతన సాహితీ ఆధ్వర్యంలో మల్లావధుల సదాశివుడు స్మారక పురస్కార ప్రదానసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదాశివుడు పురస్కారాన్ని మోహన్‌రుషి, పసునూరి శ్రీధర్‌బాబుకు బహూకరించారు. అనంతరం మాట్లాడుతూ.. సదాశివుడు పాట ఎంతో గొప్పదని, తెలంగాణ మలిదశ ఉద్యమానికి సదాశివుడి పాట చైతన్యం తీసుకొచ్చిందని తెలిపారు. ఆయన ఆశయాన్ని కేసీఆర్ కొనసాగించారని వెల్లడించారు. 'కష్టాల్లోంచి, రైతుల వెతల్లోంచి పాటలు వచ్చాయి. నీళ్ల కోసం పాటలు వచ్చాయి. తలాపున పారుతుంది గోదారి.. చేను చెలక ఏడారి పాట తెలంగాణ నీళ్ల గోసను చూపెట్టింది. తెలంగాణ వచ్చాక ఎర్రటి ఎండలోనూ మత్తళ్లు దూకిన చెరువులు కనిపించాయి. సమైక్య పాలనలో రైతుల ఆత్మహత్యలపై సదాశివుడు పాడిన పాటలను విని కేసీఆర్ ఎంతో ఆవేదన చెందారు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి తెలంగాణ రైతాంగం కండ్లలో ఆనందాన్ని చూశారు' అని గుర్తుచేశారు. ఏ ఉద్యమ స్ఫూర్తితో రాష్ట్రాన్ని సాధించామో అదే స్ఫూర్తితో తెలంగాణలో పని చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వర్షాభావ పరిస్థితులతో నీరు లేక తిరిగి పాత రోజులు వచ్చాయని, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేడిగడ్డలో నీళ్లు ఉన్నప్పటికీ రైతులకు ఆ నీటిని విడుదల చేయకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులపై లాఠిచార్జి దురదృష్టకరమని అన్నారు. 'రోజూ పేపర్లు చూడగానే రైతులు ఆత్మహత్యలు కనిపిస్తున్నయ్. కరెంట్ కోతలు మొదలైనయ్. కళాకారులకు మూడు నెలల నుంచి జీతాలు రావటం లేదని చెప్తున్నరు. ప్రతిపక్షంగా ప్రజల తరపున మేము పోరాడుతాం. కవులు, కళాకారులు మళ్లీ తమ కలాలకు పని కల్పించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి' అని కోరారు. గత ప్రభుత్వంపై నిందలు వేయటం కాదు, రైతుల కన్నీళ్లు తుడవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని అన్నారు. ప్రముఖ కవి, సాహిత్య విమర్శకుడు, సిటీ కాలేజీలో తెలుగు శాఖ అధ్యక్షుడు కోయి కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల గుండెల్లో నిలిచిన వ్యక్తి సదాశివుడు అని కొనియాడారు. దళిత, బహుజన చైతన్యాన్ని పాటలో ఎలుగెత్తి చాటిచెప్పారని వెల్లడించారు. చాలామంది మంత్రులు ప్రొటోకాల్ ఎంజాయ్ చేస్తుంటారని, కానీ, కార్యకర్తలా పనిచేసే వ్యక్తి హరీశ్‌రావు అని తెలిపారు. దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సదాశివుడు రాసిన పాటలు దళితుల్లో ఒకడిగా ఉండి రాసినవని అన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ దేవీప్రసాదరావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, మల్లావధుల సదాశివుడు కుమారుడు విజయానంద్, వారి కుటుంబ సభ్యులు, తెలంగాణ వికాస సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు మీరిచ్చే రేటెంత?

- కాంగ్రెస్‌లో చేరేందుకు ఎంతమొత్తం ఇస్తున్నారు?
- కర్ణాటకలో బీజేపీ ప్రలోభ పెడుతున్నదంటున్నారు..
- తెలంగాణలో ఎమ్మెల్యేలకు మీరెంత ఇస్తున్నారు?
- రాహుల్‌గాంధీకి బీఆర్ఎస్ నేత కేటీఆర్ సూటి ప్రశ్న

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో ఇతర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలను చేర్చుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఎంత ఆఫర్ చేస్తున్నదని ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ప్రశ్నించారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు మీరు నిర్ణయించిన రేటెంత రాహుల్‌జీ అని ఎక్స్ వేదికగా కేటీఆర్ అడిగారు. కర్ణాటకలో అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టేందుకు బీజేపీ ఒక్కొక్కరికి రూ.50 కోట్లు ఆఫర్ చేస్తున్నదని ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య ఆరోపించిన వార్తను కేటీఆర్ ట్యాగ్ చేశారు. కర్ణాటకలో బీజేపీ 'ఆపరేషన్ కమల'ను అమలు చేస్తున్నదని, అందులో భాగంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రాజీనామా చేసి రమ్మంటున్నదని, ఉప ఎన్నికల్లో వారికి నిధులను సమకూరుస్తామని హామీ ఇస్తున్నదని సిద్ధరామయ్య ఆరోపించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్న కాంగ్రెస్ పార్టీ ఎంతమొత్తం ముట్టజెప్పున్నదని కేటీఆర్ పరోక్షంగా నిలదీశారు. తెలంగాణలో ఆర్ఆర్ (రేవంత్ రెడ్డి) టాక్స్ కలెక్షన్లు త్రిపుల్ ఆర్, కల్కి2898 సినిమాల కలెక్షన్లు మించిపోయాయి కదా? అంటూ ఎద్దేవా చేశారు.

కళ్యాణమస్తు
..మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బంధువు

శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో
రెడ్డి వధూవరులకు ప్రత్యేకంగా చూడబడును మరియు అన్ని కులముల పెండ్లి సంబంధములకు సంప్రదించండి:
16 Year's Experience
Dr. Smt. Konala Bhagyalakshmi Reddy, Astrologer,
Ex:Telangana Marriage Bureau Association.
H.O.: షాప్ నెం.48, HMDA కాంప్లెక్స్, తార్నాక, హైదరాబాద్
B.O.: Opposite Sai Baba Temple, Dilsukhnagar,
Whatsapp: 9866044439

వధువు కావలెను
★రెడ్డి:27 Yrs, 5'10", B.Tech MS, USA, SWE, USA, 200K P/A, Well Settled వరుడికి తగిన వధువు కావలెను. 9030315599
★రెడ్డి:28 Yrs, 5'7", B.Tech, SWE, 30 Lakhs P/A గల వరుడికి వధువు కావలెను. 9246960888
★కాపు:27 Yrs, 6 Ft, B.Tech., Business Analyst, Hyd, 16 Lakhs P/A గల వరుడికి తగిన వధువు కావలెను.9248064777
★కమ్మ: 28 Yrs, 5'11", B.E, Team Leader, 29 Lakhs PA, గల వరుడికి తగిన వధువు కావలెను. 9701960229
★మున్నూరు కాపు: 28 Yrs, 5'10", M.Tech, Sr. Engineer, Bangalore, 12 Lakhs P/A గల వరుడికి తగిన వధువు కావలెను. 9010051444
★పద్మశాలి: 27 Yrs, 5'10", B.Tech, SWE, Hyd, 21 Lakhs P/A గల వరుడికి తగిన వధువు కావలెను. 7207930999
★యాదవ: 27 Yrs, 5'8" B.Tech MS, SWE, Canada, 6 Lakhs P/M, Well Settled గల వరుడికి తగిన వధువు కావలెను. 9701960229
★Cast No Bar: 29 Yrs, 5'10", B.Tech., MBA, SWE, Bangalore 12 Lakhs P/A గల వరుడికి తగిన వధువు కావలెను. 9248064777
★హిందూ-మాల: 28 Yrs, 5'2", B.Tech(IIIT), M.Tech, (IIT) Central Govt. Emp. 1 Lack P/M వరుడికి తగిన వధువు కావలెను. 9030315599
★Cast No Bar: 34 Yrs, 5'8", B.Tech, SWE, Hyd, 17 Lakhs P/A గల వరుడికి తగిన వధువు కావలెను. 9246960888

వరుడు కావలెను
★రెడ్డి:26 Yrs, 5'5", B.Tech, MS, SWE, USA, 150K P/A, 15 Cr. ప్రాపర్టీ గల వధువుకి తగిన వరుడు కావలెను. 9030315599
★రెడ్డి:25 Yrs, 5'5", B.Tech MBA, Product Manager, 15 Lakhs P/A గల వధువుకి తగిన వరుడు కావలెను. 9246960888
★కాపు:24 Yrs, 5'5", B.Tech SWE, Hyd, 70,000/- P/M గల వధువుకి తగిన వరుడు కావలెను. 9248064777
★కమ్మ:27 Yrs, 5'6", B.Tech, MS, USA, SWE, USA, 140K P/A, 20 Cr. ప్రాపర్టీ గల వధువుకి తగిన వరుడు కావలెను. 9701960229
★మున్నూరుకాపు:26 Yrs, 5'6", B.Tech, MS, USA, SWE, USA, 120K P/A గల వధువుకి తగిన వరుడు కావలెను. 7207930999
★పద్మశాలి: 26 Yrs, 5'3", MBBS, MD, Doctor గల వధువుకి తగిన వరుడు కావలెను. 9010051444
★Cast No Bar: 26 Yrs, 5'4", B.Tech., MBA, Manager, Hyd, 12 Lakhs P/A గల వధువుకి తగిన వరుడు కావలెను. 9701960229
★ హిందూ-మాల: 28 Yrs, 5'2", B.Tech., MS, USA, SWE, USA, 110K P/A, Well Settled వధువుకి (India/Abroad) వరుడు కావలెను. 9246960888
★మాదిగ:26 Yrs, 5'3", MBA, SWE Hyd, 8 Lakhs P/A వధువుకి తగిన వరుడు కావలెను. 7207930999
★యాదవ-Cast No Bar-2nd Match: 38 Yrs, 5'5", B.Tech., SWE, 20 Lakhs P/A, Well Settled వధువుకి తగిన వరుడు కావలెను. 9030315599

వరుడు కావలెను
★రెండోపెళ్లి: 59Y, 58Y, 56Y, 55Y, 53Y, 52Y, 50Y, 49Y, 47Y, 46Y, 44Y, 43Y, 41Y, 40Y, 38Y, 37Y, 35Y, 33Y, 31Y, 30Y, 28Y, 27Y, 25Y, 24Y "మా సేవ" (Since 1998) PH/WA: 9291503949

4 లైన్ల ప్రకటనకు 500/- (+ GST అదనం)
ప్రతి అదనపు లైనుకు 125/-
9848077857

ఒకటిన జీతాలు ఉత్తదే!

- 13 రోజులైనా మాడల్ స్కూళ్ల టీచర్లకు అందని జీతాలు
- ఔట్‌సోర్సింగ్, హవర్లీ బేస్డ్ టీచర్స్ పరిస్థితి కూడా అంతే..
- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గెస్ట్ లెక్చరర్లకు మాట తప్పారు
- వారి ఉద్యోగాల పాడిగింపు జూలై 31 వరకే ఇవ్వడం దుర్మార్గం
- రూ.42 వేల వేతనం చెల్లించాలి
- మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): ఒకటో తేదీనే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నట్టు గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఆచరణలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నామనే మాటలు కేవలం పత్రికా ప్రకటనలకు మాత్రమే పరిమితమవుతున్నాయని ఆరోపించారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మాడల్ స్కూల్ టీచర్లకు గత 7 నెలల నుంచి ఏ నెలలో కూడా ఒకటో తేదీన వేతనాలు చెల్లించకపోవడం కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ నెలలో 13వ తారీఖు వచ్చినా మాడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచర్స్‌కు జీతాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నెల 8వ తేదీన సగం మంది ఉద్యోగులకు మాత్రమే వేతనాలు చెల్లించిన సర్కారు.. రంగారెడ్డి, నిజామాబాద్, వనపర్తి, సూర్యాపేట, సంగారెడ్డి, సిద్దిపేట, సిరిసిల్ల, పెద్దపల్లి వంటి జిల్లాల్లో పనిచేస్తున్న వెయ్యి మందికి పైగా రెగ్యులర్ టీచర్స్‌కి ఇంకా జీతాలు చెల్లించలేదని పేర్కొన్నారు. వీరితో పాటు మాడల్ స్కూల్స్‌లో పనిచేసే ఔట్‌సోర్సింగ్, హవర్లీ బేస్డ్ టీచర్స్ (హెచ్‌బీటీ) దాదాపు రెండు వేల మంది ఇంకా జీతాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులను గౌరవించి ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

రూ.42 వేల వేతనం ఇవ్వాల్సిందే

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసే గెస్ట్ లెక్చరర్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పడం బాధాకరమని హరీశ్‌రావు పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే 42 వేల రూపాయల వేతనం చెల్లిస్తామని అభయహస్తం మ్యానిఫెస్టోలో చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. వారి ఉద్యోగ భవిష్యత్తును దెబ్బతీసేలా కేవలం మార్చి 31 నుంచి జూలై 31 వరకే కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని దుయ్యబట్టారు. ఇందులో ఏప్రిల్, మే నెలల్లో సెలవులే ఉండగా, కేవలం జూన్, జూలై నెలకు మాత్రమే పొడిగింపు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల పదేండ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 1,654 మంది గెస్ట్ లెక్చరర్ల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని తెలిపారు. విద్యాసంవత్సరం మధ్యలో ఉద్యోగాలు నిలిపివేస్తే, ఎలా బతికేది అని లెక్చరర్లు, వారి కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి విద్యాసంవత్సరానికి పొడిగింపు ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. గెస్ట్ లెక్చరర్ల వ్యవస్థను ఎత్తివేసేందుకు కుట్ర జరుగుతున్నట్టు వారు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అభయహస్తం మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినట్టు గెస్ట్ లెక్చరర్లకు భరోసా ఇవ్వడంతో పాటు, నెలకు రూ.42 వేల వేతనం చెల్లించి, విద్యాసంవత్సరం చివరి వరకు ఉద్యోగ కాలాన్ని పొడగించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సుంకేపల్లి రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

కాజీపేటకు కోచ్‌ఫ్యాక్టరీ ఇవ్వాలి

బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ పెట్టాలి

- ఏపీకి 60 వేల కోట్ల ఆయిల్ రిఫైనరీ ఫ్యాక్టరీకి కేంద్రం లైన్ క్లియర్
- ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రాంతీయ పార్టీకి ఓటేసి మంచి పనిచేశారు
- తెలంగాణ బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారు?
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ) : విభజన చట్టం షెడ్యూల్ 13లో పేర్కొన్నట్టుగా కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్‌చేశారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా కేంద్ర ప్రభుత్వం ఏపీలో భారత్ పెట్రోలియం ఆధ్వర్యంలో ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ హబ్‌ను రూ.60 వేల కోట్లతో ఏర్పాటు చేయనుందని చెప్పారు. చంద్రబాబు విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగా స్పందించిందని, కేంద్ర నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. విభజన చట్టంలో ఉన్న ఆయిల్ రిఫైనరీని పదేండ్ల తర్వాత ఏర్పాటు చేస్తున్నారని గుర్తుచేశారు. శనివారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏపీలో బీజేపీకి సొంతంగా సీట్లు వస్తే ఆ రాష్ట్రానికి ఏమీ ఇవ్వకపోవునని, ఇప్పుడు బీజేపీ సర్కారు టీడీపీపై ఆధారపడి ఉన్నది కాబట్టి మోదీకి విభజనచట్టంలోని అంశాలు గుర్తుకు వస్తున్నాయని, అక్కడ ప్రాంతీయ పార్టీ గెలిచింది కాబట్టే చంద్రబాబు అడిగినవి మోదీ ఇస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రాంతీయ పార్టీకి ఓటేసి మంచి పని చేశారని పేర్కొన్నారు. 30 ఏండ్లుగా కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం పోరాటం కొనసాగుతున్నదని, పదేండ్లలో బీఆర్ఎస్ ఎంపీలు, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నిసార్లు అడిగినా తెలంగాణకు కేంద్రం ఏమీ ఇవ్వలేదని గుర్తుచేశారు. తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలున్నారని, కేంద్ర క్యాబినెట్ మంత్రి, సహాయ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నారని, విభజన చట్టంలోని అంశాలపై వారు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. 8 మంది ఎంపీలను గెలిపించినా తెలంగాణ ప్రజలకు బీజేపీ మొండి చేయి చూపిస్తున్నదని విమర్శించారు . బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాజకీయాల గురించి తప్ప రాష్ట్ర అభివృద్ధిపై ఒక్క చర్చ కూడా జరగలేదని, విభజన హామీల గురించి ఒక్క మాటా మాట్లాడలేదని దుయ్యబట్టారు.

కేసీఆర్ కొత్త తరాన్ని తీసుకొస్తారు..

రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, మళ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిచి అధికారంలోకి వస్తుందని వినోద్‌కుమార్ ధీమా వ్యక్తంచేశారు. నాడు అభివృద్ధి కోసమే బీఆర్ఎస్‌లో చేరామని చెప్పినవాళ్లంతా మళ్లీ అభివృద్ధి కోసమేనంటూ కాంగ్రెస్‌లో చేరారని అలాంటి వాళ్లు పార్టీ మారితే నష్టమేం లేదని స్పష్టంచేశారు. పార్టీలు మారే వారిపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, వాళ్లు మళ్లీ బీఆర్ఎస్‌లోకి వస్తామన్నా రానివ్వని చెప్పారు. కేసీఆర్ కొత్త తరాన్ని తీసుకొస్తారని, బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరిస్తారని, త్వరలోనే పార్టీ సమావేశాలు పెట్టుకుంటామని తెలిపారు. మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకుడు కల్యాణ్‌రావు పాల్గొన్నారు.

తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి

విద్యుత్తు కాంట్రాక్టర్లకు ని'బంధనాలు'

- స్టోర్స్‌లో అందుబాటులో లేని మెటీరియల్
- ఎల్‌సీలు ఇవ్వకపోవడంతో పెండింగ్‌లో పనులు
- ఇబ్బందులు పడుతున్న ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు
- ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు మాజీ సభ్యుడు యాదగిరి

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్తు శాఖలో కొత్తగా తీసుకొచ్చిన నిబంధనలతో విద్యుత్తు కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి తెలిపారు. రాష్ట్రంలో కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రత్యేక సమావేశానికి జీసీ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ విద్యుత్తు శాఖ స్టోర్లలో మెటీరియల్స్ అందుబాటులో ఉండటం లేదని, క్షేత్రస్థాయిలో పనులు చేసినా ఎల్‌సీ(లైన్ క్లియరెన్స్)లు ఇవ్వకపోవడంతో వినియోగదారుల నుంచి తీవ్ర ఒత్తిడి ఉండడంతో కాంట్రాక్టర్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో ఇలాంటి ఇబ్బందులు తామెప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఎలాంటి సమస్యలు లేకుండా టెండర్లు ఇచ్చేదని చెప్పారు. కాంట్రాక్టర్లుగా మారిన వారంతా నిరుద్యోగులే అయినా ప్రోత్సాహించాల్సిందిపోయి నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్టోర్లలో ఒక సామగ్రి ఉంటే, మరొకటి ఉండటం లేదని తెలిపారు. దీని వల్ల కాంట్రాక్టర్లు సకాలంలో పనులను పూర్తి చేయకపోతున్నారని చెప్పారు. ఈ ప్రభుత్వం వచ్చాక ప్రైవేట్ కాంట్రాక్టర్లు విద్యుత్తు పనులను పూర్తి చేయాలంటే ఎల్‌సీ(లైన్ క్లియరెన్స్) అతి పెద్ద సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నా టీజీఎస్‌పీడీసీఎల్ యాజమాన్యం పట్టించుకోవడం లేదని చెప్పారు. చాలా చోట్ల విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాంట్రాక్టర్ల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు సభ్యుడు నేమాల బెనర్జి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఆలూరు మహేందర్, ఉపాధ్యక్షుడు ఆర్ ప్రదీప్‌రెడ్డి, జీడిమెట్ల డివిజన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సికింద్రాబాద్ డివిజన్ జనరల్ సెక్రటరీ అశోక్, కాంట్రాక్టర్లు జీ చక్రధర్‌రావు, వీ చిన్న పుల్లారావు, మాణిక్యాలరావు, రవీందర్‌గౌడ్, కనకాచారి, బాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఈశ్వర్‌రావు, శ్రీకాంత్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘం నాయకురాలిపై రౌడీషీట్

- చెన్నూర్, కోటపల్లి స్టేషన్లలో 8 కేసులు నమోదు
- మొదటిసారిగా మంచిర్యాల జిల్లాలో మహిళ పై రౌడీషీట్

చెన్నూర్ టౌన్, జూలై 13 : మంచిర్యాల జిల్లాలో పలు భూ వివాదాల తోపాటు ఇతర గొడవల్లో నమోదైన కేసుల్లో నిందితురాలైన ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) నాయకురాలు మద్దెల భవానిపై శనివారం రౌడీ షీట్ తెరిచినట్టు చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన మద్దెల భవాని కొన్నేండ్లుగా పలు భూములు, ఇతర వివాదాల్లో తలదూర్చి గొడవలకు పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు ఆమెపై చెన్నూర్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 7, కోటపల్లి పరిధిలో ఒక కేసులు నమోదైనట్టు వివరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమెపై రౌడీ షీట్ తెరిచినట్టు పేర్కొన్నారు. ఇప్పటి నుంచి ఆమె కదలికలపై నిత్యం నిఘా ఉంటుందని, ప్రవర్తన మార్చుకోకుండా మళ్లీ భూ వివాదాల్లో తలదూరిస్తే పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. మంచిర్యాల జిల్లాలో మహిళపై రౌడీ షీట్ ఓపెన్ చేయడం ఇదే మొదటి సారి అని తెలిపారు. కాగా మద్దెల భవానికి ప్రగతి శీల మహిళా సంఘంతో ఎలాంటి సంబంధం లేదని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ స్పష్టంచేశారు. మహిళల హక్కుల కోసం పోరాడుతున్న తమ సంఘం పేరుతో భవానీ అవినీతి అక్రమ దందాలను చేయడాన్ని ఖండిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం సైకిల్ యాత్ర

పారిశుధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి: వంగపల్లి శ్రీనివాస్

ముషీరాబాద్, జూలై 13: పారిశుధ్య కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేపట్టనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. గ్రామాలు, నగరాలను పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛ భారత్‌కు కారణమవుతున్న పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పారిశుధ్య కార్మికుల సేవలను ప్రశంస్తూ ప్రధాని నరేంద్ర మోదీ మెచ్చుకున్నా వారి జీవన విధానం మారడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.